## అభివృద్ధి పథంలో నడిపించే సత్తా ఉంది



ముంతాజ్ కాలనీలో ప్రచారంలో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, మలక్‌పేట ఎంఐఎం అభ్యర్థి బలాల

సైదాబాద్, నవంబర్ 13 : అభివృద్ధి పథంలో నడిపించే సత్తా మలక్‌పేట ఎంఐఎం అభ్యర్థి అహ్మద్ బలాలకు ఉన్నదని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని ముంతాజ్ కాలనీ, జాకీరు హుస్సేన్ కాలనీ, జీవన్ యార్ జంగ్ కాలనీ, సపోటాబాగ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజలకు కోసం శక్తివంచన లేకుండా కృషి చేశారని, బలాల చేసిన అభివృద్ధి పనులను చూసి ప్రజలందరూ ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు ఒక్కటేనని అవి ప్రజల మధ్య విభేదాలు సృష్టించటానికి రాజకీయాలు చేస్తాయ న్నారు. మలక్‌పేట అభ్యర్థి బలాల మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేసి, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. నగరంలోనే ఆదర్శమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దామని తెలిపారు. మరింత అభివృద్ధి సాధించటానికి విలువైన ఓట్లు వేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. కార్యక్రమంలో అక్బర్‌బాగ్ కార్పొరేటర్ మినాజుద్దీన్, సైదాబాద్, అక్బర్‌బాగ్ డివిజన్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మళ్లీ గెలిపిస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతా



మలక్‌పేట నియోజకవర్గాన్ని ప్రజలు కోరిన విధంగా అభివృద్ధి చేశానని, ఆదరించి మళ్లీ గెలిపిస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎంఐఎం మలక్‌పేట అభ్యర్థి, ఎమ్మెల్యే అహ్మద్ల బలాల అన్నారు. సోమవారం డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, కార్పొరేటర్ మీనాజుద్దీన్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మలక్‌పేట డివిజన్‌లోని పలు కాలనీల్లో ప్రచారాన్ని నిర్వహించారు. మలక్‌పేటలో యువతకు ఉపాధి కల్పించేందుకు ఐటీ టవర్‌ను సాంక్షన్ చేయించటం జరిగిందని ఇటీవలే నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, కార్పొరేటర్ మీనాజుద్దీన్, కాలనీవాసులు, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు. **- మలక్‌పేట, నవంబర్ 13**

# సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



అజిత్‌రెడ్డిని గెలిపించాలని ఓటు అభ్యర్థిస్తున్న మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, నాయకులు

మలక్‌పేట, నవంబర్ 13 : ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న ప్రతిఒక్కరూ బీఆర్ఎస్‌కే ఓటేస్తారని, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామ రక్ష అని మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీపురం కాలనీలో కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు గుండవరపు వేణుగోపాల్‌రావు, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ అంగోతు అనితా నాయక్, డైరెక్టర్లు సల్మాన్ మహ్మద్‌ఖాన్, అభిషేకం, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థులకు విలువైన ఓట్లు గెలిపించాలని కోరారు. ప్రజా సంక్షేమంలో తెలంగాణ అన్ని రాష్ట్రాలకంటే ముందు వరుసలో ఉందని, అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్, దార్శనిక పాలనే కారణమన్నారు. అధికార పార్టీ అభ్యర్థిగా అజిత్‌రెడ్డిని గెలిపిస్తే కావల్సినన్ని నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి పరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు నాగరాజు, శివ, పీటర్, పొద్దటూరి ప్రవీణ్, ప్రసాద్, సరిత పాల్గొన్నారు.

## ఐదు నామినేషన్లు తిరస్కరణ

- బరిలో 27 మంది అభ్యర్థులు

మలక్‌పేట, నవంబర్ 13 : నల్లగొండ చౌరస్తాలోని సర్కిల్-6 డీసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మలక్‌పేట నియోజకవర్గ నామినేషన్ కేంద్రం-58 ఏసీలో ఐదుగురి నామినేషన్లు రిజెక్ట్ అయ్యాయి. మొత్తం 32 మంది అభ్యర్థులు 47 సెట్ల నామినేషన్లు దాఖలు వేయగా, నామినేషన్ల పరిశీలన అనంతరం వివిధ కారణాలతో ఐదుగురి నామినేషన్లు తిరస్కరించబడినట్లు (రిజెక్ట్ అయినట్లు) ఆర్ఓ వెంకట ఉపేందర్‌రెడ్డి తెలిపారు. తిరస్కరణకు గురైన నామినేషన్లలో ఎంఐఎం పార్టీకి చెందిన రెబెల్ అభ్యర్థి సయ్యద్ మీనాజుద్దీన్ ఒక్క ప్రపోజల్ మాత్రమే వేయటంతో తిరస్కరించబడిందని, ఇండిపెండెంట్ అభ్యర్థులు పాత మలక్‌పేట డివిజన్ మున్సిపల్ కాలనీకి చెందిన గంటి శ్రీనివాస్ అఫిడవిట్ ఫాం లో సంతకాలు చేయని కారణంగా తిరస్కరించబడిందని, మరో అభ్యర్థి టి.రాధ ప్రపోజల్స్‌లో 10 మందికిగాను తొమ్మిది మందినే చూపటంతో తిరస్కరణకు గురైందని, మరో అభ్యర్థి మహ్మద్ మాజిద్ అఫిడావిట్‌లో సంతకాలు చేయని కారణంగా తిరస్కరించబడిందని, జై మహాభారత్ పార్టీ అభ్యర్థి నయీం సుల్తానా నామినేషన్‌లో ప్రపోజల్స్, అఫిడవిట్ సరిగ్గా లేని కారణంగా తిరస్కరణకు గురైనట్లు ఆర్ఓ వెంకట ఉపేందర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 32 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, అందులో ఐదుగురి నామినేషన్లు తిరస్కరణకు గురవగా, 27 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా నేటి నుంచి విత్‌డ్రా ప్రక్రియ మొదలవుతుందని ఆయన తెలిపారు.

## యాకుత్‌పురలో మూడు నామినేషన్లు తిరస్కరణ

సైదాబాద్, నవంబర్ 13 : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో యాకుత్‌పుర ఎమ్మెల్యే అభ్యర్థులుగా 30 మంది నామినేషన్లు దాఖలు చేయగా, మూడు తిరస్కరిచినట్లు రిటర్నింగ్ అధికారి ఈ.వెంకటాచారి తెలిపారు. తిరస్కరణకు గురైన వారిలో కె.వినయ్‌కుమార్ ( కాంగ్రెస్ పార్టీ రెబల్), జై భరత్ పార్టీకి చెందిన మహేజా బిన్, స్వతంత్ర అభ్యర్థి మహ్మద్ అయూబ్ షాద్ ఉన్నారని తెలిపారు. ముగ్గరు వ్యక్తులు తమ నామినేషన్లు పత్రాల్లో సరైన అధారాలను చూపించకపోవటంతో తిరస్కరించినట్లు వివరించారు. యాకుత్‌పుర అస్మెంబ్లీ సెగ్మెంట్‌లో 27 మంది నామినేషన్ల పత్రాలు సరిగ్గా ఉన్నాయని, ఉపసంహరణ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత చివరికి ఉండే అభ్యర్థుల సంఖ్య స్పష్టంగా తెలుస్తోందని పేర్కొన్నారు.

## ప్రమాద బాధితులకు అండగా ఉంటాం



బజార్‌ఘాట్‌లో సోమవారం జరిగిన అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని నాంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్ సందర్శించారు. ఘటనపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం బాధితులకు అండగా నిలబడుతుందని తెలిపారు. అగ్నిప్రమాద ఘటనలో తొమ్మిది మంది మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం జేశారు. **- మెహిదీపట్నం, నవంబర్ 13**

## రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

**- ఐదున్నర టన్నులు స్వాధీనం**

సైదాబాద్, నవంబర్ 13 : రేషన్ బియ్యంను అక్రమంగా బ్లాక్ మార్కెట్‌లోకి తరలిస్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్‌చేసి ఐదున్నర టన్నుల (పీడీఎస్) బియ్యం సాధీనపర్చుకున్న ఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాతనగరంనకకు చెందిన సయ్యద్ బద్రుద్దీన్ రేషన్ బియ్యంను వివిధ మార్గాల ద్వారా సేకరిస్తున్నాడు. సైదాబాద్ వినయ్‌నగర్ కాలనీలోని టెలికాం క్వార్టర్స్ సమీపంలో ఓ గోదాం ఏర్పాటుచేసుకొని అక్కడ నిల్వ చేశారు. అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సైదాబాద్ పోలీసులు గోదాంపై దాడిచేసి బియ్యంను స్వాధీన పర్చుకుని, నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని మలక్‌పేట సివిల్ సప్లైయింగ్ అధికారులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్సై నవీన్ దర్యాప్తు జరుపుతున్నారని ఆయన తెలిపారు.

## పేద కుటుంబాలకు సేవ చేయడానికి..



పేద రోగుల కుటుంబాలకు సేవ చేయడానికి వన్ హార్ట్ ఫౌండేషన్ ఇండియా ముందుకు వచ్చింది. ఫౌండేషన్ అధ్యక్షుడు మహేశ్ మంద ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తన స్నేహితులతో కలసి సేవ కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు. దీపావళి సందర్భంగా నిలోఫర్‌లోని రోగుల కుటుంబాలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారి పరిస్థితిని చూసి స్పందించి నెలకోసారైనా ఇలాంటి కార్యక్రమాలు చేసేందుకు అందరూ ముందుకు వచ్చారని మహేశ్ అన్నారు. **- రవీంద్రభారతి, నవంబర్ 13**

## నాలాల ఆధునీకరణ..

# తొలగిన వరద కష్టాలు



ఓపెన్‌నాలా విస్తరణ పనులు పరిశీలిస్తున్న మలక్‌పేట సర్కిల్ డీసీ జయంత్ (ఫైల్)

సైదాబాద్, నవంబర్ 13 : మలక్‌పేట నియోజక వర్గ పరిధిలో వరదనీటి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం అన్వేషించి మార్గం చూపారు. ముంపు ఇబ్బందుల నుంచి బస్తీవాసులకు పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టారు. వరదనీటి ఇబ్బందులను శాశ్వతంగా తొలగించటానికి నాలాల ఆధునీకరణ చేపట్టారు. ఓపెన్ నాలాలతో తరుచూ కలిగే ఇబ్బందుల నుంచి ప్రజలకు పూర్తిస్థాయి విముక్తి కల్పించారు. రూ.64 కోట వ్యయంతో ఓపెన్ నాలల విస్తరణ, ఆధునీకరణ, డ్రైన్ల నిర్మాణ పనులను పూర్తి చేశారు. మలక్‌పేట సర్కిల్ పరిధిలో వర్షాకాలం వస్తుందంటే జీహెచ్ఎంసీ అధికారులకు పరీక్ష కాలంగా ఉండేది. దాంతో ముందుగానే బహత్తర ప్రణాళికలను అధికారులు సిద్ధం చేసుకుంటారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సత్వర పరిష్కారంపై దృష్టిసారించారు. లోతట్టుప్రాంతాలకు పొంచి ఉన్న ముప్పును ముందుగానే పసిగట్టి 39 నాలాల పూడికతీత, ఆధునీకరణ పనులను రూ.64 కోట్ల వ్యయంతోపాటు ఓపెన్ నాలాల ఆధునీకరణ పనులను పూర్తి చేశారు.

**నిధులు కేటాయింపుతో యుద్ధ ప్రతిపాదిక పనులు పూర్తి..**

మలక్‌పేట అక్షయ్ టిఫెన్ సెంటర్, శంకేశ్వరబజార్, అజంపుర సన్‌షైన్ కాలనీ, శంకేశ్వరబజార్, సింగరేణి ఆఫీసర్స్ కాలనీ ప్రాంతాల్లో నీరు సాఫీగా వెళ్లేందుకు ఓపెన్ నాలాల విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేశారు. సరూర్‌నగర్ చెరువు మినీట్యాంక్ బండ్ నుంచి వచ్చే నీరు సులువుగా పోయే విధంగా శంకేశ్వర బజార్ ఓపెన్ నాలాలో పూడికతీత పనులను చేపట్టి పూర్తి చేశారు. సరూర్‌నగర్ చెరువు తూముల ద్వారా పోయే వరదనీరు శంకేశ్వరబస్తీలోకి రాకుండా ఇప్పటికే ప్రహరీ నిర్మించామని అధికారులు తెలిపారు. దీంతో బస్తీవాసులకు వరదనీటి కష్టాలను తొలగించారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో అనేక ప్రాంతాల్లో ఆధునీకరణ పనులను చేపట్టారు. వర్షాకాలంలో తలెత్తే వరద నీటి ముంపు సమస్యలను పరిష్కరించటానికి యుద్ధ ప్రతిపాదిక రంగంలోకి టీంలను దించి అప్రమత్తం చేస్తున్నారు. నిధుల రావడం, వెంటనే అధికారులు స్పందించడం క్షేత్రస్థాయిలో నాలాల ఆధునీకరణ పనులు పూర్తికావటంతో ముంపు సమస్యల నుంచి బస్తీవాసులకు విముక్తి లభించటంతో వారు దీమాగా ఉన్నారు.

## మాదన్నపేట కూరగాయల మార్కెట్ ధరలు



| కూరగాయలు | కిలో రూ. | కూరగాయలు | కిలో రూ. |
|---|---|---|---|
| ఆలుగడ్డ | 20 | సొరకాయ | 10 |
| టమాట | 24 | క్యాబేజ్ | 12 |
| వంకాయలు | 30 | క్యారట్ | 35 |
| బెండకాయ | 20 | క్యాలీఫ్లవర్ | 20 |
| మిర్చి | 50 | దొండ | 16 |
| గోకరకాయ | 30 | కీర | 20 |
| చిక్కుడు | 50 | దోసకాయ | 16 |
| బిన్నీస్ | 60 | క్యాప్సికమ్ | 35 |
| బీరకాయ | 20 | బీట్‌రూట్ | 20 |
| కాకరకాయ | 20 | | |

ఈ ధరలు నేటి ఉదయం 9.30గంటల వరకు కూరగాయల మార్కెట్‌లో అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు